## క్లుప్తంగా

### సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### టెన్త్ విద్యార్థులకు పరీక్షా విధానంపై అవగాహన


పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న మురళీ తదితరులు

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు పరీక్షా విధానంపై శనివారం స్వామి వివేకానంద విద్యానికేతన్ ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి.మురళీ మనోహర్, వివేకానంద స్కూల్ ప్రిన్సిపాల్ ప్రమీల, అసోసియేషన్ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాస్, పలురువు సభ్యులు పాల్గొని ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించిన ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేశారు. పర్సనాల్టీ డెవలప్‌మెంట్, పదో తరగతి తర్వాత ఏ విధంగా డెవలప్ అవ్వాలి, ఏ కోర్సు తీసుకుంటే మంచిది తదితర అంశాలపై వివరించారు. పర్సనాల్టీ డెవలప్‌మెంట్‌పై మోటివేటర్ చంద్రశేఖర్ సూచనలిచ్చారు. 20 ఏళ్లుగా టెన్త్ క్లాస్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. విద్యార్థులు ఇప్పటి వరకు చదివిన అంశాలన్నీ రివైజ్ చేసుకోవాలని, ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే విజయం సాధించవచ్చని సూచించారు.

### నేటి నుంచి గ్లకోమా వారోత్సవాలు


డాక్టర్ మీనాక్షి

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఏటా నిర్వహిస్తున్న గ్లకోమా (నీటి కాసులు) వారోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 15 వరకు నిర్వహిస్తామని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. ఈ వారం రోజుల్లో రోజూ ఉదయం 9 గంటల నుంచి రామాటాకీస్ సమీపంలో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ప్రత్యేక గ్లకోమా స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. గ్లకోమా వైద్య నిపుణులు డాక్టర్ సౌజన్య, వాణిశ్రీ వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ముఖ్యంగా కళ్లద్దాలు వాడుతున్న వారు, రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు తప్పకుండా గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారా మెడికల్ సిబ్బందితో గ్లకోమా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### బెస్ట్ ఫ్యాషన్ అచీవర్‌గా ఆల్మా


అవార్డుతో ఆల్మా

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బెస్ట్ ఫ్యాషన్ - 2025 అచీవర్ అవార్డును గురిందపల్లి ఆల్మా అందుకున్నారు. నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా క్వీన్స్ ఈవెంట్ శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవాల్లో ఆమెను అవార్డుతో సత్కరించారు. గతేడాది క్వీన్ ఈవెంట్ నిర్వహించిన బ్రెడ్స్ ఆఫ్ ఇండియా పోటీల్లో ఆల్మా రన్నరప్‌గా నిలిచారు. అలాగే స్టార్‌లైట్స్ ఈవెంట్స్ నిర్వహించిన పోటీల్లో విజయం సాధించి ఒకేసారి 3 కిరీటాలు సొంతం చేసుకున్నారు.


డాక్టర్ రాధారాణిని సన్మానించి మెమెంటో అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


ఎం.ఎ.బేగంను సత్కరిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు


పేడాడ రమణకుమారిని సత్కరిస్తున్న తోట పద్మావతి

# అన్ని రంగాల్లో మహిళలు ఎదగాలి

● అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తలు

**మహారాణిపేట: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని జిల్లా వైద్య** ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆకాంక్షించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలో 80 శాతం వరకు మహిళలు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. మహిళలు మరింత ఆర్థికంగా, సామాజికంగా ప్రగతి సాధించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ జోనల్ మలేరియా డాక్టర్ పి.శాంతిప్రభ మాట్లాడుతూ మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పి.రాధారాణి మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందున్నారని, పురుషులతో సమానంగానే బాధ్యత కలిగి ఉంటున్నారన్నారు. ప్రాంతీయ మహిళా శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో మహిళలు అధికంగా ఉద్యోగ అవకాశాలు కలిగి ఉన్నారన్నారు. ఏఎన్ఎం గాను, ఆశా కార్యకర్త గాను తమ సేవలు నిరంతరం కుటుంబానికి, సమాజానికి అందచేస్తున్నారని కొనియాడారు. జిల్లా మలేరియా అధికారి తులసి, జిల్లా మీడియా విస్తరణాధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాలకు చెందిన డాక్టర్ పి.నళిని, ఐ.మనోరమ, మణికుమారి, సుభాషిణి, భాగ్యరేఖ, లావణ్య, ఇంద్రజ తదితరులు ప్రసంగించారు. ఉత్తమ సేవలందించిన పలువురు మహిళలను ప్రముఖుల చేతుల మీదుగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. పలు విభాగాల అధికారులు రవిశంకర్, జి.శ్రీనివాస్, నాగభూషణం, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం వందన సమర్పణ చేసి హాజరైన అందరికీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.


కేజీహెచ్‌లో మహిళా దినోత్సవం జరుపుకుంటున్న నర్సులు


జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు

◆ కేర్ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకుని ఆరోగ్యవంతంగా ఉంటున్న పలువురు మహిళను ఆస్పత్రి నిర్వాహకులు సన్మానించారు. మహిళా వైద్యులకు అభినందనలు తెలిపారు.

◆ కేజీహెచ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి ఆధ్వర్యంలో నర్సులు కేక్ కట్ చేశారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

**పేడాడ రమణకుమారికి సత్కారం**

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణకుమారిని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి సత్కరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో దక్షిణ నియోజకవర్గ 14 వార్డుల అధ్యక్షులతో కలిసి కార్పొరేటర్ ఆమెను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**నారీశక్తిని గౌరవించాలి**

దాబాగార్డెన్స్: నారీశక్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఏపీ అండ్ టీ బీఈఎఫ్ ముఖ్య కార్యదర్శి బీఎస్ రాంబాబు పేర్కొన్నారు. ఏపీ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మహిళా దినోత్సవాన్ని దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన బాధ్యత ఉందన్నారు. యూబీఐ జనరల్ మేనేజర్ ఎంఎస్ షాలిని మీనన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళల పాత్ర కీలకమన్నారు. శంకర్, లలిత జోషి, రిచా గాంధీ, స్వాతి, ఉదయ్‌కుమార్, వసంతరావు పాల్గొన్నారు.

◆ పైడా మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సరోజ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సీతామాణిక్యం పాల్గొని మహిళా దినోత్సవ ప్రాముఖ్యత వివరించారు. మహిళలు విద్యలో రాణించి మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ సీతామాణిక్యంను సత్కరించారు.

◆ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ దర్శకుడు డాక్టర్ మణిభూషణ్ పర్యవేక్షణలో నిర్వహించిన వేడుకల్లో వాస్తు బ్రహ్మ డాక్టర్ నారాయణమూర్తి పట్నాయక్, సామాజిక, సాహితీవేత్త జాలాది విజయ, ఏఎం ప్రసాద్, ప్రజా గాయకుడు దేవిశ్రీ ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ నేమాల హేమసుందరరావు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తూ ఫౌండేషన్‌తో భాగస్వాములైన నారీమణులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. సీఈవో సీతారామస్వామి, ఆదిత్య భూషణ్, సత్యవాణి, నీరజ, ప్రవీణ పాల్గొన్నారు.

◆ మహారాణిపేటలో గల మహిళా శక్తి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గట్రెడ్డి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, హిందీ ఆచార్యులు ద్వితీయ భాషా విభాగాధ్యక్షురాలు డాక్టర్ పీకే జయలక్ష్మి సంపాదకత్వంలో 30 మంది మహిళా ఆధ్యాపకులు 'సాధికార మహిళ' అంశంపై రచించిన 'ద ఎంపవర్డ్ వుమెన్' గ్రంథాన్ని ఆవిష్కరించి రచయితలను అభినందించారు. కార్యక్రమంలో సిస్టర్ మేరీ, నాన్సీ, దిపాలి, డాక్టర్ హరిణి, మాణిక్యకుమారి, డాక్టర్ సుధ, సోని, అనుపమ, డాక్టర్ సుజాత, అనిత, ప్రమీల, భూషణవతి తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీయూ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు


డాక్టర్ సీతామాణిక్యంను సత్కరిస్తున్న పైడా కళాశాల ప్రిన్సిపాల్


సత్కరించిన నారీమణులతో నిర్వాహకులు

### మహిళల పోరాటాలను అణచివేస్తున్న ప్రభుత్వాలు

అల్లిపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత, సమానత్వం కోసం చేసే పోరాటాలను అణచివేస్తున్నాయని మహిళా సమాఖ్య విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.ఎ.బేగం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అల్లిపురం నీలం రాజశేఖరరెడ్డి భవనం వద్ద ఆమె జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలను ఓటు బ్యాంక్‌గానే పాలకులు చూస్తున్నారన్నారు. అనంతరం బేగంను మహిళా సమాఖ్య కార్యకర్తలు సత్కరించారు. ఎ.దేవుడమ్మ, ఎస్.అరుణ, ఎ.అన్నపూర్ణ, బి.పుష్పలత, చెల్లూరి నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.


సన్మానించిన మహిళలతో కేర్ యాజమాన్యం

### 108 మహిళా ఉద్యోగుల ఆనందోత్సాహాలు


కేక్ కట్‌చేస్తున్న 108 మహిళా ఉద్యోగులు

మహారాణిపేట: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ (108 అంబులెన్స్) మహిళా ఉద్యోగులందరూ ఆనందోత్సాహాలతో వుమెన్స్ డే వేడుకలు జరుపుకున్నారు. రేసపువానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ త్రినాథ్, జిల్లా కో ఆర్డినేటర్ సురేష్, మహిళా ఉద్యోగులు రమణమ్మ, శైలజ, ఎర్రమ్మ, సంతోషిని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### మహిళామణుల సేవలు అమోఘం


మహిళను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

విశాఖ విద్య: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ, ప్రజా సేవలోనూ తరిస్తుండటం గొప్ప విషయమని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ పద్మావతి అన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో దాబాగార్డెన్స్ నెల్లూరు మెస్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేసే మహిళా ఉపాధ్యాయులంతా తరలివచ్చి వేడుకలో భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ మహిళామణుల సేవలు అమోఘమని కొనియాడారు. నగరంలో వివిధ రంగాల్లో పని చేస్తూ విశేష సేవలు అందించిన మహిళలను ఘనంగా సత్కరించారు.

మహిళా ఉపాధ్యాయులంతా విధి నిర్వహణలో తమ అనుభవాలను పంచుకున్నారు. ఆటపాటలతో కేరింతలు కొట్టారు. మహిళా ఉపాధ్యాయులందరినీ ఒక చోటకు చేర్చి, కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేసిన ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కమిటీ అధ్యక్షురాలు సునీత, ప్రధాన కార్యదర్శి హేమలత తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదేవతల పండగలకు వాసుపల్లి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో జరుగుతున్న గ్రామదేవతల పండగలకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం ఆశీల్‌మెట్టలో గల తన కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేశారు. కుల, మతాలకతీతంగా ప్రజాసేవే పరమావధిగా సాయమంటే తన వద్దకు వచ్చే వారికి సొంత నిధులతో చేయూత అందిస్తున్నానని తెలిపారు. అధికారంలో ఉన్నా, లేకున్నా తన ప్రజలకు అండగా నిలుస్తున్నట్లు వాసుపల్లి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా కార్యదర్శి ఆదివిష్ణు రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్త రాజు, అలపున కనకారెడ్డి, లండా రమణ, లింగం శ్రీను, ఆరుగుల రాజు, బోర శ్రీనివాసరెడ్డి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఎల్లమ్మ జాతర


అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం ఎల్లమ్మ జాతర శనివారం వైభవంగా జరిగింది. జగదాంబ జంక్షన్ వద్ద వెలసిన ఆలయంలో వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారితో పాటు ఆమె సోదరుడు పోతురాజుకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, దేవదాయ శాఖ అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఎల్లమ్మతోట, చాకలిపేట, కనకలవీధి, కుమ్మరవీధి, దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, మహారాణిపేట, అంగటిదిబ్బ, దాబాగార్డెన్స్, సూర్యాబాగ్, బొడ్డు నాయుడు తోట, లలితానగర్ తదితర ప్రాంతాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, భీమిలి, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఎల్లమ్మతల్లి పుట్ట వద్ద మాలధారులు శూలాల ప్రదర్శన చేపట్టారు. అగ్నిగుండం తొక్కారు. అమ్మవారి దర్శనం కోసం ఎల్లమ్మ గుడి నుంచి జగదాంబ జంక్షన్ వరకు క్యూలైన్లు బారులు తీరాయి. ఎల్లమ్మ అమ్మవారి పుట్ట, సోదరుడు పోతురాజు పుట్ట వద్ద కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, మొక్కులు సమర్పించుకున్నారు. టూటౌన్, మహారాణిపేట పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదం పంపిణీ చేశాయి. ఆలయ ఈవో పీఎల్ఎన్ రాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


యల్లమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

**తొలేళ్లతో ప్రారంభం..**

మహా శివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి జాతర ముందు రోజు (శుక్రవారం) అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ జిల్లెలమూడు వీధిలోని జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మ అమ్మవారు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెట్టి అక్కడి నుంచి మేళతాళాలతో అమ్మవారిని తీసుకొచ్చారు.


ఆంజనేయ స్వామి వేషధారణలో నృత్యం చేస్తున్న యువకులు


అమ్మవారి పండగను పురస్కరించుకుని శూలాలు ధరించిన భక్తులు

# హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలి

సీతమ్మధార: చిరు వ్యాపారులకు అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వీధి విక్రయదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు షేక్.రెహమాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశీలమెట్టలోని జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరక్క... పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక వలస వచ్చి విశాఖ నగరంలో అనేక సంవత్సరాల నుంచి అద్దె ఇళ్లలో నివసిస్తూ చిరు వ్యాపారం చేసుకుని జీవిస్తున్నామన్నారు. వ్యాపారం చేసుకునేందుకు సరైన షెల్టర్ లేక ఎండకు ఎండుతూ... వర్షాలకు తడుస్తూ... సరకులు తడిచిపోయి అమ్ముడుపోక అప్పులపాలవుతున్నామని వాపోయారు. వీటికితోడు పోలీసులు, జీవీఎంసీ అధికారులు కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ అధికారులు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేసి అన్ని ప్రాంతాల్లో హాకర్ జోన్లు ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ముద్ర రుణాలు మంజూరు చేసి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.ఎ.అచ్యుత్ రావు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, ఎస్.నాగభూషణ్, ఎస్.నగేష్, ఎస్.వినోద్, పి.ప్రకాష్, ఎ.అనసూయ, రాము తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న సత్యనారాయణ

# రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ పీఆర్ బిషోయి సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లాకు చెందిన గోబర్ధన టిక్రి, చంద్ర పాంగి విశాఖపట్నం మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. 18.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

# మత స్వేచ్ఛ హరిస్తున్నారు..


సెమినార్‌లో అతిథులు, క్రైస్తవ మత పెద్దలు

తాటిచెట్లపాలెం: దేశంలో మత స్వేచ్ఛను హరిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. మత స్వేచ్ఛ అనే అంశంపై కైలాసపురం రోడ్‌లో గల గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో గరికిముక్కల పాల్ విక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో డాక్టర్ కూచిపూడి బాబూరావు, శామ్యూల్ ఆనంద్, డాక్టర్ కాకుమాను రాజ శిఖామణి, డాక్టర్ పులుగుజ్జు సురేష్ మాట్లాడారు. దేశంలో మత స్వేచ్ఛ హరిస్తున్న వారిపై పోరాడేందుకు పలు క్రైస్తవ సంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు. భారత రాజ్యాంగం క్రైస్తవులకు కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతికూల పరిస్థితుల్లో న్యాయ సహాయం అవసరమైతే తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో బి.ఫ్రాంక్లిన్ సుధాకర్, సీఆర్ఐఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు క్రిస్టోఫర్ డేవిడ్ బొజ్జ, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి, అఖిల భారత క్రైస్తవ హక్కుల మండలి అధ్యక్షుడు పాస్టర్ ప్రేమ్ తరంగ, ఉత్తరాంధ్ర నుంచి బిషప్స్, ఆర్చి బిషప్స్, పాస్టర్స్, మత పెద్దలు పాల్గొన్నారు.